సాక్షి మహబూబాబాద్

సోమవారం | 16 | డిసెంబర్ | 2024



కొండెక్కిన కొబ్బరికాయ

ఆధ్యాత్మిక జీవన విధానంలో కొబ్బరికాయకు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి కొబ్బరికాయ ధర కొండెక్కింది. ఒక్కో కొబ్బరికాయ రూ.30 వరకు చేరింది. - 8లో▸



మతోన్మాదం రోజురోజుకూ పెరుగుతోంది

దేశంలో రోజురోజుకూ మతోన్మాదం పెరిగిపోతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.2°/11.9°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మానుకోటలో పీఓహెచ్ ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ లోకో మోటివ్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్(పీఓహెచ్) వర్క్‌షాపు ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎలక్ట్రికల్ లోకో మోటివ్ పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్ షాపు ఏర్పాటుకు అన్ని రకాల వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించి జిల్లా కేంద్రంలో పీఓహెచ్ ఏర్పాటు చేయిస్తే, ఈ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. తద్వారా 5వేల మందికి ప్రత్యక్షంగా మరో 5ఐదు వేల మందికి పరోక్షంగా ఉపాధి కలుగుతుందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రైల్వే శాఖలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న రైల్వే అధికారులు చొరవచూపి ఎలక్ట్రికల్ లోకో మోటివ్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్ షాపు ఏర్పాటు చేయించాలని కోరారు.

బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు



మహబూబాబాద్ రూరల్ : జిల్లాలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ (అడ్మిన్) అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బాంబ్ స్క్వాడ్ బృందం సభ్యులు ఆదివారం తనిఖీలు చేశారు. జిల్లాలో జరిగిన గ్రూప్–2 పరీక్షల సందర్భంగా, పరీక్షలు ముగిసిన అనంతరం పరీక్ష కేంద్రాల నుంచి పరీక్ష పేపర్లను తీసుకువెళ్లే మార్గాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాంబ్ స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు.

నేటి ప్రజావాణి రద్దు

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్: గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో ఈ నెల 16న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. జిల్లాలోని అధికారులు గ్రూప్–2 పరీక్షల విధుల్లో ఉన్నందున ప్రజావాణి రద్దు చేశామని అన్నారు. కావునా ప్రజలు గమనించి ఈ సోమవారం ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టరేట్‌కు రావద్దని ఆయన పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి




కురవి: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కో–కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు అన్నారు. మండల కేంద్రంలో ఈనెల 26, 27వ తేదీల్లో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సమావేశాల వాల్ పోస్టర్లను ఆదివారం కురవి బస్టాండ్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో విద్యావ్యవస్థపై సవతి తల్లి ప్రేమ చూపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలన్నారు. ఈ సమావేశాలకు జాతీయ అధ్యక్షుడు వీపీ సానూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కొలిపాక వీరేందర్, మనోజ్, నరేష్, సుమంత్, వరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



నెల్లికుదురు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణకుమార్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఆయుధాల గది, రోజువారీ రికార్డులు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ జగదీష్, ఎస్సై చిర్ర రమేష్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పాఠం!






సమ్మెలో పాల్గొన్న కేజీబీవీ ఉపాధ్యాయులు(ఫైల్)

సమ్మెలో ఉపాధ్యాయులు

బాలికల విద్యను ప్రోత్సహించడం, డ్రాపౌట్ తగ్గించేందుకు కేజీబీవీలు ఏర్పాటు చేశారు. సర్వశిక్ష అభియాన్ పరిధిలో నిర్వహించే ఈ పాఠశాలలు ప్రతీ మండలంలో నెలకొల్పారు. ఇలా జిల్లాలో మొత్తం 18 మండలాలు ఉండగా కొత్తగా ఏర్పడిన ఇనుగుర్తి, సీరోలు మండలాలు మినహా 15 మండలాల్లో పూర్తి స్థాయిలో.. దంతాలపల్లిలో కొత్తగా పాఠశాలను ఏర్పాటు చేశారు. కాగా ఆరు పాఠశాలల్లో ఇంటర్ వరకు, మిగిలిన వాటిల్లో పదో తరగతి వరకు మొత్తం 3,315మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి బోధించేందుకు 175 మంది సబ్జెక్టు టీచర్లు, 16 మంది స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారు. వీరందరు పది **రోజులు**గా సమ్మెలో పాల్గొనడం, గత ఐదు రోజుల నుంచి పూర్తి స్థాయిలో సమ్మెలోనే ఉండి పాఠశాలకు వెళ్లడం లేదు. దీంతో విద్యార్థినులకు పాఠాలు ఆగిపోయాయి.

సాక్షి, మహబూబాబాద్: 'ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని.. అలా వీలుకాకపోతే మినిమం పే స్కేల్ ఇవ్వండి' అని సమగ్ర శిక్ష ఉద్యోగులు పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈమేరకు సమ్మెలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఈమేరకు జిల్లాలోని కేజీబీవీల్లో పాఠం చెప్పేవారు కరువయ్యారు. దీంతో విద్యార్థినులకు భోజనం పెట్టి వదిలేస్తున్నారు.

విద్యార్థినుల్లో టెన్షన్..



కేజీబీవీల్లో ఇటీవల జరిగిన బదిలీలతో 34 ఖాళీలు ఏర్పడ్డాయి. అయితే మూడు నెలలు గడిచినా ఖాళీలను భర్తీ చేయలేదు. దీంతో సబ్జెక్టుల సిలబస్ చెప్పేవారు లేక ఇబ్బందులు తప్పడం లేదు. డిసెంబర్ వరకు పూర్తి కావాల్సిన టెన్త్, ఇంటర్ సిలబస్ సగంలోనే ఉంది. దీనికి తోడు ఇప్పుడు టీచర్ల సమ్మెతో మొత్తం పాఠాలు ఆగిపోయాయి. ఇతర పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తిచేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటే.. కేజీబీవీల్లో మాత్రం పాఠాలే పూర్తికాకపోవడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కేజీబీవీల్లో కేవలం మహిళా టీచర్లే బోధించాల్సి ఉంటుంది. పర్యవేక్షణ కూడా మహిళా అధికారులు చేయాల్సి ఉంటుంది. అయితే పాఠశాల పనివేళలు కాకుండా అదనపు సమయం కేటాయించి పాఠం చెప్పలేమని కొందరు టీచర్లు చెబుతుంటే.. కేజీబీవీల్లో బోధనకు వెళ్తే తాము పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులపై దృష్టి పెట్టలేమని మరికొందరు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం అటు ఉపాధ్యాయులతోపాటు ఇటు విద్యార్థినుల భవిష్యత్‌తో ముడిపడి ఉందని, త్వరగా నిర్ణయం తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గం చూస్తున్నాం..



కేజీబీవీ టీచర్లు సమ్మెలో పాల్గొనడంతో ఆయా పాఠశాలల్లో బోధన కుంటుపడిన విషయం వాస్తవమే. అయితే టెన్త్ క్లాస్ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా టీచర్లతో బోధన జరిపేలా చూస్తున్నాం. అయితే ఇందుకు కొందరు సమ్మతిస్తే మరికొందరు బోధించేందుకు నిరాకరిస్తున్నారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు బోధనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- రవీందర్ రెడ్డి, డీఈఓ

నేటినుంచి ధనుర్మాసోత్సవాలు



ఆలయంలోని గోదాదేవి అమ్మవారు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నేటి నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస వ్రతమహోత్సవ ప్రవచనాలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్య స్వామి, సత్యం గౌతం మహారాజ్ అన్నారు. ఈ సందర్భంగా వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి వారి మంగళాశాసనాలతో, తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో ధనుర్మాస వ్రతమహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వేణుగోపాలస్వామి దేవాలయంలో నెల రోజులపాటు ధనుర్మాస ప్రవచనాలు కొనసాగుతాయని తెలిపారు. సోమవారం ధనుర్మాసం ప్రారంభం అవుతుందని, ప్రథమ పాశురం సేవాకాలం, అనంతరం వేంకటేశ్వర శరణాగతి దీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 6.00 గంటల నుంచి విష్ణుసహస్రనామ పారాయణం ఉటుందని, అనంతరం తిరుప్పావై ప్రవచనాలపై ప్రసంగిస్తారన్నారు. భక్తులు ప్రవచనాలకు హాజరై శ్రీమన్నారాయణుడి, గోదాదేవి అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆయన తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 గంటలకు సేవా కాలం, తీర్థ ప్రసాదగోష్టి ఉంటుందన్నారు.

క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేయాలి

- తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి



క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో పాటు నిత్యసాధన తప్పనిసరిగా చేయాలని తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి అన్నారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అండర్–16, 18, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఊర యుగంధర్‌రెడ్డి తెలిపారు. 2, 4, 6, 10కేఎం రన్నింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు ఈనెల 22న నాగర్‌కర్నూల్‌లో జరిగే 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పీడీలు వాసుదేవరావు, సాంబమూర్తి, రజనీకాంత్, మహేందర్, కృష్ణమూర్తి ఉన్నారు.

నేడు మల్లన్న ఆలయంలో దృష్టికుంభం


ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో జాతరకు ముందు ప్రతియేటా నిర్వహించే తొలి ఘట్టం దృష్టికుంభం. నేడు(సోమవారం) ఉదయం ఐదు గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. దృష్టికుంభం అనంతరం ఆర్జిత సేవలు పునరుద్ధరిస్తామని, భక్తులు గర్భాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చని పేర్కొన్నారు.

ఎగవేసినోళ్లకే 'సీఎంఆర్'..?!

ధాన్యం కేటాయింపుల్లో ఇష్టారాజ్యం

- పక్కదారి పడుతున్న కస్టమ్ మిల్లింగ్ ధాన్యం
- రూ.కోట్ల బకాయి ఉన్న వారికే కేటాయింపులు
- కమిషనర్ పేషీకి చేరిన ఫిర్యాదులు..
- ఒకే రైసుమిల్లర్ వద్ద 320 ఏసీకేలు
- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇదే తీరు..

సాక్షిప్రతినిధి, వరంగల్ : కస్టమ్ మిల్లింగ్ ధాన్యం దారి తప్పుతోంది. సర్కారు ధాన్యంతో కొందరు రైసుమిల్లర్లు సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు.. సకాలంలో ప్రభుత్వానికి బియ్యం చెల్లించకుండా పక్క రాష్ట్రాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తిరిగి రాబట్టుకునే విషయంలో మిల్లర్లపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రతి సీజన్‌లో రూ.కోట్ల విలువ చేసే ధాన్యం పొందిన చాలా మంది మిల్లర్లు మరాడించి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఏడాది, రెండేళ్లయినా ఇవ్వడం లేదు. కొందరు ఓ సీజన్ బియ్యం మరో సీజన్‌లో చెల్లించి అధికారులను 'మేనేజ్' చేస్తున్నారు. ఇంకొందరు రెండు సీజన్లకు చెందిన బియ్యం ఇవ్వకుండా 'డిఫాల్టర్'ల జాబితాలో ఉన్నా.. వారికి సైతం సీఎంఆర్ కింద ధాన్యం ఇవ్వడం రైసుమిల్లర్ల వర్గాల్లో చర్చ జరుగుతుండగా, కమిషనర్ వరకు ఫిర్యాదులు వెళ్లడం కలకలం రేపుతోంది.



తంతుగా మారుతున్న సీఎంఆర్ దందా..

కస్టం మిల్లింగ్ ధాన్యాన్ని పక్కదారి పట్టించడం ప్రతియేటా కొందరు మిల్లర్లకు తంతుగా మారుతోంది. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అందించే సంకల్పంతో ప్రతి సీజన్‌లో ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని నేరుగా సమీప మిల్లులకు పంపిస్తుంది. కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం ప్రకారం.. క్వింటా ధాన్యాన్ని మర ఆడించి.. 68 కిలోల బియ్యం తిరిగి 15–30 రోజుల గడువులో సర్కారుకు అప్పగించాలి. కానీ, ధాన్యం కేటాయింపుల సమయంలో కొందరు అధికారుల చేతివాటం ఫలితంగా కస్టమ్ మిల్లింగ్‌కు ఇచ్చిన ధాన్యాన్ని తిరిగి రాబట్టుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. సీఎంఆర్‌పై ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయిలో వివాదం అయిన విషయం తెలిసిందే. 2022–23లో సీఎంఆర్ గడువు దాటినా.. హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచి బియ్యం ప్రభుత్వానికి చేరలేదు. దీంతో ఎఫ్‌సీఐ, పౌరసరఫరాలశాఖలు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా.. హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో మొత్తం 1,31,560 మెట్రిక్ టన్నుల బియ్యం ఆయా మిల్లుల్లో లేవని తేలింది. 36 మంది రైస్‌మిల్లర్లకు నోటీసులు ఇచ్చారు. అయినా నేటికీ పూర్తిస్థాయిలో బియ్యం ఎఫ్‌సీఐకి చేరకపోగా ఇటీవలే 9 రైసుమిల్లులపై కేసులు నమోదు చేశారు.

ఆ రైస్‌మిల్లర్లపై ఎందుకో ప్రేమ..!

రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బకాయి ఉన్న సుమారు 24 మందికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ వానాకాలం ధాన్యం కేటాయించినట్లు పౌరసరఫరాల సంస్థ హైదరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు ఆయన ఆదేశాల ప్రకారం సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఆరా తీస్తున్నాయి. ఇదిలా ఉంటే.. హనుమకొండ జిల్లాలో ఇద్దరు రైస్‌మిల్లర్లు పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్లాది రూపాయల విషయంలో కొంత మంది సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హసన్‌పర్తి మండలానికి చెందిన ఓ వ్యాపారి ధాన్యం కొనుగోలు చేసిన సుమారు రూ.8 కోట్ల వరకు బకాయి ఉండటంతో పాటు గతేడాది యాసంగి సీఎంఆర్ కూడా రూ.కోట్లలోనే ఉన్నట్లు తెలిసింది. అయినప్పటికీ సదరు రైస్‌మిల్లర్‌కు సుమారు 320 ఏసీకే (ఒక ఏసీకే అంటే 270 క్వింటాళ్లు)ల ధాన్యం ఈ సీజన్‌లో కేటాయించడంపై రైస్‌మిల్లర్లే ముక్కున వేలేసుకుంటున్నారు. అదే మండలానికి చెందిన మరో రైస్‌మిల్లరు తనతోపాటు ఒకరిని భాగస్వామిని చేసుకుని అతడి పరపతితో టెండర్‌లో కొనుగోలు చేసిన సర్కారు ధాన్యం, సీఎంఆర్ బకాయిలు రూ.కోట్లల్లో ఎగవేసి తప్పించుకు తిరుగుతున్నట్లు సమాచారం. అయితే ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కేటాయింపులు చేస్తున్నామని చెప్పడం గమనార్హం. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల నివేదికలు, కమిషనర్ విచారణ పూర్తయితే అన్ని వివరాలు బట్టబయలు కానున్నాయన్న చర్చ రైస్‌మిల్లర్ల వర్గాల్లో జరుగుతోంది.

పరీక్షకు హాజరవుతున్న దివ్యాంగులు



బందోబస్తు నిర్వహిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



గ్రూప్–2 పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతంగా ఎగ్జామ్స్
- ఆలస్యంగా వచ్చిన 10 మంది అభ్యర్థులు వెనక్కి
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



బయోమెట్రిక్ నమోదు చేసుకునేందుకు క్యూలో నిల్చున్న అభ్యర్థులు



ఆలస్యంగా వచ్చి పరీక్ష కేంద్రం బయట నిరీక్షిస్తున్న అభ్యర్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు ఆదివారం తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8:30 గంటలకు అభ్యర్థుల హాల్‌టికెట్లను సిబ్బంది పరిశీలించి కేంద్రాల్లోకి అనుమంతించారు. బయోమెట్రిక్ నమోదు ద్వారా గదుల్లోకి అనుమతించారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటలకు పేపర్–1 పరీక్ష జరిగింది. అలాగే మధ్యాహ్నం పేపర్–2 పరీక్షకు అభ్యర్థులు హాజరు కాగా.. 2:30గంటలకు గేట్లు మూసివేశారు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30గంటలకు పేపర్–2 పరీక్ష జరిగింది. కాగా ఉదయం ఆలస్యంగా పరీక్షకు హాజరైన 10మంది అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. పలువురు అభ్యర్థులు గర్భిణులు, చంటిపిల్లలతో తరలివచ్చారు.

హాజరు అంతంతే..

ఉదయం జరిగిన పరీక్షకు 7,470 మంది అభ్యర్థులకు గానూ 3,886మంది హాజరై 3,584 మంది గైర్హాజరయ్యారు. 52 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 7,470 మంది అభ్యర్థులకు గానూ 3,868మంది హాజరై 3,602 మంది గైర్హాజరయ్యారు. ఈమేరకు 51.78శాతం హాజరు నమోదైంది.

పోలీస్ బందోబస్తు..


జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా విధులు నిర్వహించి 163 సెక్షన్ అమలు చేసింది. అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీఓ బలరాంనాయక్, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, రూరల్ సీఐ పి.సర్వయ్య జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాల్లో పరిశీలించారు. అదేవిధంగా ప్రత్యేక అధికారులు 21 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు 21మంది, రూట్ ఆఫీసర్లు ఆరుగురు, జిల్లాస్థాయి ప్రత్యేక అధికారులు 24మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10మంది, ఐడెంటిఫికేషన్ అధికారులు 86 మంది విధులు నిర్వహించారు. పరీక్షల సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేశారు.

చంటిపాపను లాలించిన సీఐ



పాపను లాలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్

జిల్లా కేంద్రంలోని తక్షశిల హైస్కూల్ పరీక్ష కేంద్రంలో గ్రూప్–2 పరీక్షకు మహిళా అభ్యర్థి చంటిపాపతో హాజరైంది. కాగా చిన్నారిని పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్తుండగా అధికారులు అనుమతించలేదు. దీంతో అభ్యర్థి పాపను తన భర్తకు అప్పగించి హాల్‌లోకి వెళ్లింది. ఈక్రమంలో చంటిపాప ఏడుస్తుండగా.. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబల్, టౌన్ సీఐ దేవేందర్ కాసేపు ఎత్తుకొని లాలించారు.



హేమాచలక్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచలక్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాలతో పాటు పొరుగున్న ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రైవేట్ బస్సులు, కార్లు, ఆటోల్లో భక్తులు ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్నారు. ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్య స్నానాలు ఆచరించి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తిలతైలాభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారులు స్వామివారి విశిష్టత ఆలయ చరిత్రను వివరించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన తిలతైలాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు మానవ శరీరాన్ని పోలి ఉన్న స్వామివారి నిజరూప దర్శనం చేసుకొని పులకించిపో యారు. సంతానం కోసం వచ్చిన దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారి నాభిచందన ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిత్య అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులకు విరాళాలను అందజేశారు.



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

పర్యాటక ప్రదేశాలుగా మహాకవుల క్షేత్రాలు

● ప్రముఖ కవి లక్ష్మీనారాయణ


సోమనాథుని స్మృతీ వనంలో లక్ష్మీనారాయణ

పాలకుర్తి టౌన్: మహాకవుల క్షేత్రాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేయడం అభినందనీయమని ప్రముఖ కవి, శరత్ సాహితీ కళ స్రవంతి అధ్యక్షుడు పబ్బని లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పాల్కురికి సోమనాథుడి స్మృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుర్తి ప్రాంతం కవులకు పుట్టినిల్లని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుడి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్

● ఏఎస్సై పేరుతో సైబర్ నేరగాడి కాల్..
● రూ.60 వేలు ఫోన్ పే చేయించుకున్న కేటుగాడు
● మోసపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

గూడూరు: ఏఎస్సై భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి పేరుతో సైబర్ నేరగాడు చేసిన ఫోన్ కాల్‌తో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ. 60 వేలు మోసపోయాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపు యజమాని గాదె అనిల్‌కు 'నేను గూడూరు ఏఎస్సై భాస్కర్‌రెడ్డిని మాట్లాడుతున్న' అని చెప్పగానే ఆ షాపు యజమాని నిజమేనని నమ్మి, చెప్పండి సార్ అన్నాడు. వెంటనే అవతలి వైపు వ్యక్తి.. మన ఎస్సై పేరెంట్స్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఫోన్ పే నుంచి రూ. 60 వేలు కావాలి పంపు.. నేను నీకు లిక్విడ్‌క్యాష్ పంపిస్తా అన్నాడు. ఇది నమ్మిన ఆ షాపు యజమాని తన వద్ద పనిచేస్తున్న బాలుకు చెప్పాడు. బాలు తనకు తెలిసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాంకుడోతు గోపినాథ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. ఆ తరువాత వారు గోపినాథ్ ఫోన్ నంబర్‌ను సైబర్ నేరగాడికి ఇచ్చారు. అంతలోనే సైబర్ నేరగాడి నంబర్ 7661957326 నుంచి గోపినాథ్‌కు ఫోన్ వచ్చింది. 'మీరు ఫోన్ పే చేస్తానన్నారట కదా' అంటూ మరో నంబర్‌కు ఫోన్ పే చేయమని 8888 680 873 నంబర్ ఇచ్చి, నేను వెంటనే నీకు లిక్విడ్ క్యాష్ పంపిస్తా.. నువ్వు మాత్రం వెంటనే ఈ నంబర్‌కు ఫోన్ పే చేయమన్నాడు. దీంతో బాలు చెప్పాడు కదా అని నమ్మిన గోపినాథ్.. సైబర్ నేరగాడు ఇచ్చిన నంబర్‌కు రూ. 60 వేలు ఫోన్ పే చేశాడు. 15 నిమిషాల తరువాత తనకు డబ్బులు పంపిస్తానన్నాడు.. నేను (గోపినాథ్) నువ్వు చెప్పిన ఏఎస్సైకి డబ్బులు పంపించానని బాలుకు ఫోన్ చేసి తెలిపాడు. వెంటనే బాలు.. ముందుగా వచ్చిన సెల్ నంబర్‌కు కాల్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గుర్తించిన షాపు యజమాని, వర్కర్ బాలు, ఉపాధ్యాయుడు గోపినాథ్ వెంటనే గూడూరు పీఎస్‌కు చేరుకుని ఏఎస్సై భాస్కర్‌రెడ్డి పేరుతో కొద్ది సమయం క్రితం ఫోన్ చేశారు ఎవరు సార్ అంటూ ఏఎస్సైని అడిగారు. ఇక్కడ నేను ఏస్సైఐని, భాస్కర్‌రెడ్డి ఎవరూ లేరంటూ ఏస్సైగా చెప్పగా, వారు ఎస్సై గిరిధర్‌రెడ్డికి జరిగిన మోసాన్ని వివరించారు. వెంటనే ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. అనంతరం గూడూరు పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు.

కొండెక్కిన కొబ్బరికాయ..

రూ.30కి చేరిన ధర

● గతంలో రిటేల్ రూ.20
● ప్రముఖ దేవాలయాలు, జాతరల్లో మరింత ప్రియం
● తమిళనాడు నుంచి దిగుమతి తగ్గడమే కారణం..

గీసుకొండ: ఏ చిన్న కార్యక్రమం ప్రారంభోత్సవమైనా.. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా.. ఆలయంలోకాని, ఇంట్లో దేవుడికి మొక్కు చెల్లించాలన్నా కొబ్బరికాయ కొట్టడం తప్పనిసరి. ఈ ఆచారం పూర్వకాలం నుంచి వస్తోంది. వివిధ పూజల్లో ఎన్ని నైవేధ్యాలు సమర్పించినా కొబ్బరికాయ లేనిదే ఆ నివేదనకు పరిపూర్ణం ఉండదు. పూజ పూర్ణ ఫలాన్ని ఇవ్వదు. అందుకే కొబ్బరికాయ ఆధ్యాత్మికంగా అగ్రస్థానంలో నిలుస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే కొబ్బరికాయ.. భక్తుల ఆధ్యాత్మిక జీవన విధానంతో పెనవేసుకుని ఉంది. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన కొబ్బరికాయ ధర ప్రస్తుతం కొండెక్కింది. మూడు నెలల క్రితం రిటేల్ మార్కెట్‌లో ఒక్కో కొబ్బరికాయ ధర రూ. 18 నుంచి రూ. 20 వరకు ఉండేది. పస్తుతం రూ. 30 వరకు చేరింది. జాతరలు, తీర్థాలు, ప్రముఖ ఆలయాల వద్ద అయితే ఒక్కో టెంకాయ ధర రూ. 35 వరకు అమ్ముతున్నారు.


వరంగల్ మార్కెట్‌కు దిగుమతి అయిన కొబ్బరి కాయలు

కొబ్బరి కాయలు ఎక్కడి నుంచి వస్తున్నాంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు రోజూ పది డీసీఎం వాహనాల్లో కొబ్బరి బొండాలు, మరో పది డీసీఎంల్లో మొక్కులు చెల్లించుకోవడానికి కొట్టే కొబ్బరి కాయలు దిగుమతి అవుతున్నాయి. వీటిలో తమిళనాడు నుంచి వచ్చేవి అగ్రభాగంలో ఉంటున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాల్లోని పాలకొల్లు, రాజోలు, అమలాపూరం, అంతర్వేది, కాకినాడ, యానాం, ఎస్రాయవరం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వస్తున్నాయి. వీటిలో తమిళనాడు నుంచి వచ్చే కాయలు పెద్ద సైజ్‌లో ఉంటాయి. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చే కొబ్బరి కాయలు చిన్నగా ఉంటాయి. అయితే తమిళనాడు కాయలు నెల రోజుల వరకైనా నిల్వ ఉంటాయని, అవి ఒక కాయకు హోల్‌సేల్‌లో రూ. 25 వరకు లభిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆంధ్రా కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరగా మచ్చలు వచ్చి పాడైపోతాయని, వాటికి హోల్‌సేల్‌లో ఒకదానికి రూ. 20 నుంచి రూ. 25 వరకు ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు.

ప్రముఖ ఆలయాలకు సరఫరా..

కాళేశ్వరం, కొమురవెల్లి, ఐనవోలు, అన్నారం లాంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలతోపాటు జాతరల సందర్భంగా వ్యాపారులు రోజూ కొబ్బరి కాయలను అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్కో కాయకు రూ.30 నుంచి రూ. 35 వరకు అమ్ముతున్నారు. అయితే తమిళనాడులో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కొబ్బరికాయలు డిమాండ్ మేరకు రావడం లేదని, అందుకే ధర పెరిగిందని, త్వరలో కొంత తగ్గే అవకాశం ఉందని కొబ్బరి కాయల హోల్‌సేల్ వ్యాపారులు మేడిపెల్లి యాదిరెడ్డి, నాసం మల్లేశం తెలిపారు. కాగా, వరంగల్ నగరంలో సుమారు 15 వరకు హోల్‌సేల్ కొబ్బరికాయల షాపులు ఉన్నాయి.

ధర పెరగడం ఇబ్బందే



"కొబ్బరికాయల ధర పెరగడం మా లాంటి వారికి కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. గతంలో రూ. 18కి అమ్మితే ఇప్పుడు రూ. 30 వరకు అమ్ముతున్నారు. పూజలు చేసేవారు, ఆలయాలకు వెళ్లి మొక్కుకునే వారిపై కొంత భారం పడుతుంది.
-దేవులపల్లి హేమలత, గృహిణి, మచ్చాపూర్

ధర పెరిగింది వాస్తవమే..



కొబ్బరి కాయల ధర కొంత పెరిగిన మాట వాస్తవమే. ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చేవి రూ. 20 వరకు, తమిళనాడు నుంచే వచ్చే వాటికి రూ. 28 నుంచి రూ. 30 వరకు అమ్ముతున్నా. తమిళనాడు నుంచి వచ్చే కాయలు పెద్దగా ఉండి కొన్ని రోజుల పాటు పాడైపోకుండా ఉంటాయి.
-ఆరె చేరాలు, కిరాణాషాపు యజమాని

'వైభవలక్ష్మి' షాపింగ్ మాల్ ప్రారంభం


వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వరంగల్ చౌరస్తా : వరంగల్ జేపీఎన్ రోడ్డులోని వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌ను ఆదివారం రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ నగరాలకు దీటుగా వరంగల్‌లో తక్కువ ధరకే వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలు అందించాలని యాజమాన్యానికి సూచించారు. వ్యాపారంలో యువత ముందుకు రావాలన్నారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక పట్టు చీరలతో, మెన్స్, కిడ్స్, ఎత్నిక్ వేర్ కౌంటర్స్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రూ.పదివేల కొనుగోలుపై బంగారు నాణెం, విద్యార్థులకు 10శాతం ప్రత్యేక రాయితీ అందించడంపై యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు గందే కల్పన, పల్లం పద్మ, షాపింగ్ మాల్ యాజమాన్యం వద్రి లలిత్, ప్రదీప్ కుమార్, బజాజ్, సూరజ్ సరడ, పి.హరీశ్, పి.రిషిత పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణకు కృషి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన టార్చ్ బృందం

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రాష్ట్రంలో వారసత్వ సంపద, చారిత్రాత్మక కట్టడాల సంరక్షణకు ప్రత్యేకంగా కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేస్తున్న టీమ్ ఆఫ్ రిసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్(టార్చ్) బృందం ఆదివారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో కిషన్ రెడ్డిని కలిసి నివేదిక, పలు అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టార్చ్ వ్యవస్థాపకుడు, నగరానికి చెందిన చరిత్రకారుడు అరవింద్ ఆర్య పకిడే మాట్లాడుతూ ఘనచరిత్ర కలిగిన తెలంగాణలో కేంద్రపురావస్తుశాఖ ఇప్పటి వరకు ఎనిమిది నిర్మాణాలే గుర్తించి పరిరక్షణకు పూనుకుందని, ఆంధ్రప్రదేశ్‌లో 138, మహారాష్ట్రలో 300కు పైగా, ఇతర రాష్ట్రాల్లో వందల సంఖ్యలో గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో కాకతీయులు నిర్మించిన చంద్రవెల్లి ఆలయం ఆలనాపాలనా లేక శిథిలావస్థకు చేరుకుని కూలిపోయే స్థితికి చేరిందని, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మంత్రికి కోరారు. రాష్ట్రంలో కోట్ల సంవత్సరాల క్రితం మనుగడ సాగించిన జీవ జాతులు శిలాజాలు(ఫాసిల్స్) లభ్యమవుతున్నాయని, వీటి సంరక్షణకు ప్రత్యేకంగా ఫాసిల్‌పార్క్ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా చరిత్ర సంరక్షణలో పరిశోధనలు చేస్తున్న టార్చ్ బృందాన్ని మంత్రి అభినందించారు. అనంతరం ఆయనకు వృక్షశిలాజాన్ని వారు బహూకరించారు.

ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు

● వరంగల్ ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి
● రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జంగా రాఘవరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్స్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ అందించేందుకు కావాల్సిన వసతులను కల్పించడంలో తానెప్పుడు ముందుంటానన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 300 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాం తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జనవరి 9 నుంచి 11వ తేదీ వరకు వరంగల్ జిల్లా గీసుగొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కై లాస్‌యాదవ్, డీఎస్‌ఏ ఖోఖో కోచ్ రాజారపు రమేశ్ పాల్గొన్నారు.

మంచిగా చదువుకోమని మందలించిన తల్లి..

● మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య
● మహబూబాబాద్‌లో ఘటన


శ్రావ్య(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మంచిగా చదువుకోమని తల్లి మందలించగా మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని గడ్డి మందుతాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్‌లో చోటుచేసుకుంది. టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రం పరిధి రాంసింగ్ తండాకు చెందిన ధరావత్ కవిత భర్త వెంకన్న మూడేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కవిత జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో అద్దెకు ఉంటోంది. కవితకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇందులో పెద్ద కుమార్తె శ్రావ్య (19) స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్దిరోజుల నుంచి కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటోంది. తరచూ సెల్ ఫోన్ చూస్తుండడంతో తల్లి కవిత ఆ విధంగా ఎందుకు చేస్తున్నావు.. కళాశాలకు వెళ్లమని మందలించింది. క్షణికావేశంలో మనస్తాపానికి గురైన శ్రావ్య శనివారం గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటలకు మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ధనుర్మాసం.. పరమపవిత్రం

● నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం
● జిల్లాలోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు
● గ్రామాల్లో హరిదాసులు, మేలుకొలువుల సందడి


నగరంలోని అదాలత్ వెనుక ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు

హన్మకొండ కల్చరల్: దైవారధనకు విశిష్ట మాసం ధనుర్మాసం. పవిత్రమైన ఈ మాసం శ్రీమహా విష్ణువుకు అత్యంత ప్రీతికరం. దక్షిణాయనంలో చివరి మాసం కూడా ఇదే. సూర్య భగవానుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఈ మాసానికి ధనుర్మాసం అని పేరు వచ్చింది. ఈ మాసంలో 30 రోజులు విశిష్ట పండుగగా ప్రజలు జరుపుకుంటారు. ధనుర్మాసం దేవతలకు బ్రహ్మ ముహూర్తం వంటింది. ఈ మాసం అంతా దేవతలు వేకువ జామున మహావిష్ణువును, మహేశ్వరుడిని ఆరాధిస్తారు. జనవరి 14 మకర సంక్రాంతితో ధనుర్మాసం ముగుస్తుంది.

నెలగంటకు శ్రీకారం..

ఈ ఏడాది డిసెంబర్ 16న (సోమవారం) ఉదయం 6.44 గంటలకు సూర్యుడు ధనుర్‌లగ్నంలో ప్రవేశం చనున్నాడు. ఈ సమయంలో పుల్ల గుమ్మడి కాయపై బ్రాహ్మణ పెద్దలు గంట పెట్టడం ద్వారా నెలగంట కార్యక్రమానికి శ్రీకారం చుడుతారు. అక్కడి నుంచి సంక్రాంతి వరకు శుభ కార్యక్రమాలకు దూరంగా ఉంటారు. నెల గంట పెట్టిన రోజునే ఆలయాల్లో పురోహితులు గంట పూజలను కూడా చేస్తారు. ఇక్కడ నుంచి సంక్రాంతి వరకు గోదాదేవికి సంబంధించిన పూజలు విష్ణు ఆలయాల్లో పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

అపరనారదులు హరిదాసులు

కీర్తనలు పాడుతూ నగర, గ్రామాల్లో సంచరించే హరిదాసులు ధనుర్మాస రాయబారులు. అపర నారదులుగా పిలవబడే వీరు సంక్రాంతి లక్ష్మీకి స్వాగతం పలుకుతారు. హరిదాసు ఆగమనం సంక్రాంతి సంబురాలకు సంకేతం.

పల్లెల్లో సందడి..

ధనుర్మాసం నెలరోజులు వేకువజామున గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దుల సందడి కనిపిస్తుంది. జంగమయ్య పాటలు, మేలుకొలుపు భజనలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. మరో వైపు రైతులు పంట కళ్లాల్లో పూజలు చేస్తారు. పంటలు చేతికి అంది ఇంటికి చేరే వేళ రంగవల్లులతో వాకిళ్లను తీర్చిదిద్దుతారు.

వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాస పూజలు ..


నగరంలోని పలువైష్ణవ దేవాలయాల్లో సోమవారం నుంచి జనవరి 15వతేదీ వరకు ధనుర్మాస పూజలు జరుగనున్నాయి. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, హనుమకొండ అదాలత్ వెనుక గల ఎస్వీకాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆయా ఆలయాల బాధ్యులు, అర్చకులు ఏర్పాట్లు చేశారు.

అద్భుత ఫలితాలు అందించే వ్రతమే ధనుర్మాసవ్రతం



సూర్యమానం ప్రకారం సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించిన సమయాన్ని ధనుర్మాసమని, తిరిగి మకరరాశిలో ప్రవేశించిన సమయాన్ని మకరసంక్రమణమని పిలుస్తారు. ఈ మాసంలో దీక్ష , ధనుర్మాసవ్రతం గొప్ప ఫలితాన్ని అనుగ్రహిస్తుంది. గోదాదేవి ఆచరించి మనకు అందించింది. అద్భుత ఫలితాలు అందించే వ్రతమే ధనుర్మాసవ్రతం.
ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ధర్మప్రవచనకుడు, శ్రీగోదామాధవ ఆధ్యాత్మిక ప్రచారకేంద్రం, వికాస్‌నగర్

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతి


జగదీశ్(ఫైల్)

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని సురక్ష ఆస్పత్రి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారి తాటికొండ జగదీశ్ (40) మృతి చెందాడు. ఎస్సై చెన్నకేశవులు కథనం ప్రకారం.. బాణాపురం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న జగదీశ్‌కు రెండు నెలల క్రితం వివాహం జరిగింది. ఆర్టీసీ చౌరస్తా సమీపంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాత్రి 11.30 గంటల సమయంలో జగదీశ్ ద్విచక్రవాహనంపై ఆర్టీసీ చౌరస్తాకు వచ్చే క్రమంలో యూటర్న్ తీసుకుంటుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే 108లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దనాగారం స్టేజీ సమీపంలో యువకుడు..

నర్సింహులపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజాము మండలంలోని పెద్దనాగారం స్టేజీ సమీపంలో జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాథోడ్ రాజేందర్(33) హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. తన భార్య ఖమ్మంలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో బైక్‌పై హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తుండగా పెద్దనాగారం స్టేజీ సమీంలో హైవేపై బైక్ అదుపు తప్పింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ..

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


సత్యవతి (ఫైల్)


చికిత్స పొందుతున్న నాగేశ్వరరావు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి మండల కేంద్రం నుంచి గొళ్లగూడెం గ్రామం వైపు ఆటో వెళ్తుండగా చొక్కాల గ్రామం నుంచి మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై కొప్పుల నాగేశ్వరావు, రొడ్డ మహేశ్ వస్తున్నారు. శివాలయం సమీపంలో ద్విచక్రవాహం, ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఉప్పేడు గ్రామానికి చెందిన గందం సత్యవతి(56) మృతి చెందగా రామ టెంకి సమ్మక్కకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై ఉన్న వాజేడు మండల పరిధిలోని కొప్పురుకు చెందిన రొడ్డ మహేశ్‌కు స్వల్పగాయాలు కాగా వెంకటాపురం(కె) మండల పరిధిలోని చొక్కాల గ్రామానికి చెందిన కొప్పుల నాగేశ్వరావుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమ్మక్క, మహేశ్‌ను స్థానిక వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

● ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్

జనగామ: జనగామ మండలం సిద్దిపేట ప్రధాన రహదారి ఓబుల్‌కేశ్వాపూర్ స్టేజీ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై చెన్నకేశవులు కథనం ప్రకారం.. బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములు సందెల శ్రీనివాస్, రాములు కుమారులు అశ్విన్, అంజి బైక్‌పై జనగామకు బయలుదేరారు. ఈ క్రమంలో బైక్‌ను ఓబుల్‌కేశ్వాపూర్ స్టేజీ రైస్ మిల్లు ప్రాంతంలో కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలుకావడంతో 108లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుల మామ మల్యాల శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెన్నకేశవులు తెలిపారు.

మతోన్మాదం రోజురోజుకూ పెరుగుతోంది

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత అంపశయ్యనవీన్


సుబ్బాచారికి పురస్కారం ప్రదానం చేస్తున్న అంపశయ్యనవీన్, అరసం బాధ్యులు

విద్యారణ్యపురి : దేశంలో రోజురోజుకూ మతోన్మాదం పెరిగిపోతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య వాసిరెడ్డి భాస్కర్‌రావు స్మారక సాహితీ పురస్కారసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం నవల పోటీలల్లో ఆచార్య పులికొండ సుబ్బారావు రచించిన 'రేపు తిరగబడితే' అనే నవలకు వాసిరెడ్డి ఆచార్య భాస్కర్‌రావుస్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంపశయ్య నవీన్ మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలన్నింటిలో నవల సమాజాన్ని గొప్పగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రస్తుతం 'రేపు తిరగబడితే' నవల ఆ స్థానాన్ని భర్తీచేసిందన్నారు. రజక కులస్తుల ఇతివృత్తంపై ఇంత సుదీర్ఘ నవల ఇదే మొదటిదని, రచయితను అభినందించారు. కులానికి పునాది మతమేనని మతం పోకుండా కులం పోదని అభిప్రాయపడ్డారు. విశిష్టఅతిథి, కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ పులికొండ సుబ్బాచారి మంచి రచయిత అన్నారు. అరసం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి నిధి పుస్తకాన్ని పరిచయం చేస్తూ రజకుల ఇతివృత్తిగా ఈనవల కొనసాగిందన్నారు. పురస్కార గ్రహీత పులికొండ సుబ్బాచారి మాట్లాడుతూ ఈనవలలోని పాత్రలన్నీ సజీవమైనన్నారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కశంకర్ నారాయణ మాట్లాడారు. అరసం జిల్లా అధ్యక్షుడు బూరబిక్షపతి అధ్యక్షత వహించి మాట్లాడారు. రచయిత వెంకటి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, కాసర్ల రంగారావు, గజ్జెల స్వరూప, కోడెం కుమారస్వామి, గాదరి ఉప్పలయ్య, రాజమహ్మద్, అంజలి, రవళి, విష్ణుప్రియ, మౌనిక, సంధ్య, వెంకన్న, రాజు, కాసుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ

● ఓరుగల్లు పీఠాధిపతి ఉడుములబాల, బిషప్ డేనియల్


కేక్ కట్ చేస్తున్న బిషప్ ఉడుముల బాల

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచ మానవాళికి పండుగరోజు అని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల, వేడుకల చైర్మన్ బిషప్ డేనియల్ కల్యాణపు అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ కెథిడ్రల్ చర్చి ప్రాంగణంలోని ఆంథోని పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి క్యాథలిక్, టీసీఎఫ్, ప్రొటెస్టెంట్ సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా 12వ యునైటెడ్ మెగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో బిషప్ ఉడుముల బాల, బిషప్ డేనియల్ కళ్యాణపు మాట్లాడారు. క్రీస్తు రక్షణ విప్లవానికి 2025 ఏళ్లు కావొస్తున్నాయన్నారు. భారతదేశంలో క్రైస్తవానికి అనేక సమస్యలు, సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. ప్రజలకు క్రీస్తు ఆశీర్వాదాలు ఉండాలని ఆకాంక్షించారు. వైస్ చైర్మన్ బిషప్ జాన్‌మార్కండేయ, బిషప్ దామెర ఐజాక్, బిషప్ జాన్‌మార్క్, వేడుకల జర్నల్ కన్వీనర్ ఫాదర్ తాటికొండ జోసెఫ్ క్రీస్తు జననంపై సందేశం చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఫాదర్ కాసుమరెడ్డి, పాస్టర్ బొజ్జా కిష్టోఫర్, కోఆర్డినేటర్ జాన్‌బన్నీ, సీఆర్‌ఐ వైస్ ప్రెసిడెంట్ సిస్టర్ కల్పన, ఫాతిమానగర్ చర్చి ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్, వరంగల్ డయాసిస్ ఉమెన్ కమిషన్ ప్రెసిడెంట్ సెలీనా, అరుణ్ పాల్గొన్నారు.